77117

# తప్పులన్నీ తెలియవు

వసుంధర

ప్రకాశరావు కిళ్ళీ కొట్టుతో ప్రారంభించాడు వ్యాపారం. ఇప్పుడతడికి పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోరుంది. తన విజయానికి రెండే రెండు కారణాలంటాడతడు. ఒకటి స్వయంకృషి. రెండు పాపభీతి.

చిన్నప్పుడే అతడికి తల్లి చెప్పింది. "తప్పు చేయడం తప్పుకాదు. తప్పు తెలుసుకోవడం అవసరం. తెలుసుకున్న తప్పుకు ప్రాయశ్చిత్తం అవసరం".

ఈ మాటలు ప్రకాశరావులో బాగా నాటుకున్నాయి.

తనే తప్పుచేసినా ఇంటికివచ్చి తల్లికి చెప్పుకునేవాడు.

"బాగా ఆలోచించుకో — ఇంకేమైనా తప్పులు మిగిలిపోయాయేమో!" అనేది తల్లి.

"ఎందుకమ్మా అంత పట్టింపు!" అనేవాడు ప్రకాశరావు.

"మనిషి చేసిన తప్పులకు ప్రాయశ్చితం దైవప్రార్థనలో లభిస్తుంది. నేను నీ గురించి దైవాన్ని ప్రార్థిస్తాను. దేవుడికి నీ తప్పు ఒకటొక్కటి చెప్పుకోవాలి. ఒక్కటి మిగిలిపోయినా ఆ తప్పు నిన్ను జీవితాంతం పాపమై బాధిస్తుంది. శాపమై వేధిస్తుంది" అనేది తల్లి.

తల్లి అతడుచేసిన తప్పులన్నీ విని ఏ తప్పెందుకు చేయకూడదో చెప్పేది. చేయకూడని తప్పు ఒకసారికి మించి చేయకూడదని కూడా ఆమె అతడికి చెప్పేది.

ప్రకాశరావుకీమాటలంతగా రుచించేవికావు. దైవ ప్రార్థనలో తప్పుకు ప్రాయశ్చిత్తం లభిస్తుందన్న మాట అతడికి నచ్చింది.

అందుకని అతడు తన తప్పులన్నీ తల్లికి చెప్పేవాడు కాదు. ఆమె తృప్తికోసం కొన్ని మాత్రమే చెప్పిమిగతావన్నీ దేవుడికి చెప్పుకునేవాడు. తల్లైతే తప్పువిని మళ్ళీ చేయొద్దంటుంది. దేవుడు తప్పువిని ఊరుకుంటాడు. చేసిన తప్పుపోతుంది. అందువల్ల తల్లికంటే దేవుడే నయం!

ప్రకాశరావు తండ్రిది చిన్న ఉద్యోగం. అతడికి తండ్రి చేసిన అప్పులు కూడా వున్నాయి. జీవితాన్ని భారంగా వెళ్ళబుచ్చుతున్న అతడు ప్రకాశరావు పెంపకం బాధ్యతలు భార్యకే వదిలిపెట్టాడు.

ప్రకాశరావు పదహారో ఏట మెట్రిక్ ఫెయిలయ్యాడు.

తండ్రి ఏమీ అనలేదు.

తల్లి ఎంతో బాధపడి "పరీక్షలు బాగా రాశానన్నావు కదరా!" అంది.

"నిజంగా బాగా రాశానమ్మా!" అన్నాడు ప్రకాశరావు.

ప్రకాశరావు పరీక్షకని బాగా చదవలేదు. కానీ ఎగ్జామినేషన్ హాల్లో కాపీ కొట్టాడు. అందువల్ల బాగానే రాశాడనుకున్నాడు.

"అయితే నువ్వేదో తప్పుచేసి నాకు చెప్పకుండా దాచేవు. ఆ తప్పుకే నిన్ను దేవుడు శిక్షించాడు" అంది తల్లి.

"కొన్ని తప్పులు నీకు చెప్పని మాట నిజం. కానీ అన్ని తప్పులూ దేవుడికి చెప్పుకుని ప్రాయశ్చితం పొందుతూనే వున్నానమ్మా!" అన్నాడు ప్రకాశరావు.

తల్లి దెబ్బతిని "అంటే అన్ని తప్పులూ నాకు చెప్పడం లేదన్నమాట. అన్నీ నువ్వు నాకు చెబుతున్నావన్న భ్రమలోనే వున్నాను. నన్నా భ్రమలో ఉంచడం నువ్వుచేసిన పెద్ద తప్పు. ఆ తప్పుకే దేవుడు నిన్ను శిక్షించాడు" అంది.

ప్రకాశరావుకి తన తప్పు అర్థమైంది. అతడు తల్లితో "అమ్మా! అన్ని తప్పులూ నేను దేవుడికి చెప్పుకుంటాను. నీకు చెప్పుకోలేను" అని చెప్పి తన తప్పును సరిదిద్దుకున్నాడు.

"ఏ మనిషీ తన తప్పును తాను తెలుసుకోలేడు. తను చేసింది ఇతరులకు చెప్పుకుంటే వాళ్ళు విశ్లేషించి తప్పొప్పులు చెప్పగలుగుతారు. నువ్వింకా బాగా చిన్నవాడివి. నీ తప్పులు తెలుసుకునేందుకు తల్లి సాయం తీసుకోరా!" అంది తల్లి.

ప్రకాశరావు వినలేదు.

కానీ అతడు మరుసటి సంవత్సరం మెట్రిక్ పాసయ్యాడు. ఆ తర్వాత ఇంటర్మీడియెట్ కూడా పాసై బియ్యేలో చేరాడు.

ప్రకాశరావు బియ్యేలో వుండగా తండ్రి పోయాడు. దాంతో సంసారం గడవడమే కష్టమై, అతడు చదువు మానేయవలసి వచ్చింది.

నువ్వు చదువు మానకు. నేను నిన్ను చదివిస్తాను అంది తల్లి.

ప్రకాశరావు అంగీకరించలేదు. అతడి స్నేహం ఎక్కువగా కిళ్ళీకొట్ల వారితోనూ, మూటలు మోసే వారితోనూ ఉండేది. వారిలో ఒకడతణ్ణి కిళ్ళీకొట్టు తెరవమని ప్రోత్సహించాడు. అతడా ప్రోత్సాహానికి లొంగాడు.

ప్రకాశరావు తల్లికిది ఇష్టంలేదు. కానీ ఆమెకతడిపై అదుపులేదు.

రెండేళ్ళు కిళ్ళీకొట్టు నడిపాడతడు. రోజులు బాగానే వెళ్ళిపోతున్నాయి.

తల్లికి కొడుకు పెళ్ళి చూడాలనుంది.

ప్రకాశరావు మేనమామ ఒకాయనున్నాడు. ఆయనకు నలుగురు కూతుళ్ళు. ఇద్దరి పెళ్ళిళ్ళయ్యాయి. ఆయన బికారిలా అయిపోయాడు. ఆయన మూడో కూతురు కనకం. ఆమెను ప్రకాశరావుకిస్తే బాగుంటుందని మేనమామా, తల్లి కూడా అనుకుంటున్నారు.

కనకం మాత్రం "చూసి చూసి కిళ్ళీకొట్టువాణ్ణి నేను చేసుకోను" అంది.

ఈ విషయం ప్రకాశరావుకి తెలిసింది. అతడికి కనకమంటే ఇష్టం. ఆమె ఎర్రగా బుర్రగా బాగుండటమే కాక చిన్నతనంనుంచీ అంతో ఇంతో తెలియడం కూడా ఒక కారణం.

ప్రకాశరావు కనకాన్ని కలుసుకుని "కిళ్ళీకొట్టు వ్యాపారం కాదు, నన్నిలా చిన్నబుచ్చడం నీకు న్యాయంకాదు" అన్నాడు.

"నువ్వు నా మాటలకు బాధపడ్డమెందుకు? నా అభిప్రాయాలు నావి. నీ అభిప్రాయాలు నీవి" అంది కనకం.

"అలా కాదు. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవాలి" అన్నాడు ప్రకాశరావు.

"అయితే కిళ్ళీకొట్టుమానేసి కిరాణాదుకాణం ప్రారంభించు. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" అంది కనకం.

కనకమంటే ఉన్న ఆకర్షణతో ప్రకాశరావు ఆమె చెప్పినట్లే చేశాడు. అప్పుడు వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిగింది.

పెళ్లయ్యాక కనకం ఊరుకోలేదు.

కొంతమందికి సహజంగానే జీవింతలో పైకిపోయే పద్ధతులు తెలుస్తాయి. తండ్రి చాటు కూతురుగా కనకం ఏమీ చేయలేకపోయింది. కానీ పూర్తిగా ఆమె మాట వినే భర్త దొరకగానే కనకం విజృంభించింది.

"నువ్వు జీవితంలో బాగాపైకి రావాలి!" అందామె భర్తతో.

"అందుకేం చేయాలి!" అన్నాడతడు.

"చేస్తున్నావుగా వ్యాపారం... ఇది చాలు. అయితే వ్యాపారమిలా చేస్తే లాభంలేదు. కొన్ని తప్పులు చేయాలి..." అంది కనకం.

ప్రకాశరావు చిల్లరమల్లర తప్పులు చేస్తూనే వుంటాడు. అవి దేవుడికి చెప్పుకుని ప్రాయశ్చితం చేసుకుంటూనూ వున్నాడు.

**ఊళ్ళో నగల వ్యాపారి ప్రేమ్‌నాథ్ ఆ విగ్రహానికి ఊళ్ళో గుడి కట్టిస్తానన్నాడు. కనకం ఆ విగ్రహాన్నాయనకివ్వడానికి ఒప్పుకుంది. అయితే అందుకు ప్రేమ్‌నాథ్ ప్రకాశరావుకి సెంటర్లో షాపొకటి అద్దెకివ్వడానికి ఒప్పుకున్నాడు.**

"అబ్బే నువ్వు బలహీనతవల్ల తప్పులు చేస్తున్నావు. వ్యాపారంలో తప్పుల్ని పెట్టుబడిగా ఉపయోగించుకోవాలి..." అంది కనకం.

ఎలాంటి తప్పులు చేయాలో కనకం భర్తకు వివరించింది. ప్రకాశరావు హడిలిపోయాడు.

"అలా హడిలిపోతే ఎలా! గొప్పవాళ్ళు మర్డర్లుకే భయపడరు తెలుసా?" అంది కనకం.

"అంత పెద్ద తప్పులు నేను చేయలేను" అన్నాడు ప్రకాశరావు.

చేసేదాకానే తప్పులంటే భయం. ఒక్కసారి చేయడం మొదలుపెట్టాక ఎంత పెద్ద తప్పైనా చిన్నదిగా కనబడుతుంది. పెద్ద తప్పును చిన్నదిగా చూడగలవాడే పెద్దవాడౌతాడు" అంది కనకం.



"కానీ దేవుడు పెద్ద తప్పుల్ని క్షమిస్తాడా?" అన్నాడు ప్రకాశరావు.

"నాకు తెలిసిన పురోహితు డొకాయనున్నాడు. పేరు శాస్త్రి. ఏ తప్పుకెలా ప్రాయశ్చితంచేయాలో ఆయనకు బాగాతెలుసు. ఆయన్ని ఇక్కడకి రప్పిస్తాను. ఉపాధి కల్పిస్తాను. ఆయనిక్కడున్నంతకాలం ఏ తప్పులూనిన్ను బాధించవు" అంది కనకం.

"ఆయనకెలా ఉపాధి కల్పిస్తావు?" అన్నాడు ప్రకాశరావు.

కనకం మాటల మనిషికాదు.

ఆ తర్వాత వారం రోజులకి వాళ్ళింటి పెరట్లో పాతకాలం నాటి దేవుడి విగ్రహమొకటి దొరికింది. జనం విగ్రహం చూడ్డానికి రాసాగారు. క్రమంగా విగ్రహానికి పూజలు.

దొడ్లో ఓ షెడ్డు వెలిసింది. కనకం పూజారిని రప్పించింది.

పూజారికి ఉపాధి కలిగింది.

ఊళ్ళో నగల వ్యాపారి ప్రేమ్‌నాథ్ ఆ విగ్రహానికి ఊళ్ళో గుడికట్టిస్తానన్నాడు. కనకం ఆ విగ్రహాన్నాయనకివ్వడానికి ఒప్పుకుంది. అయితే అందుకు ప్రేమనాథ్ ప్రకాశరావుకి సెంటర్లో షాపొకటి అద్దెకివ్వడానికి ఒప్పుకున్నాడు.

గుడి కట్టించి ప్రేమ్‌నాథ్ బాగుపడ్డాడు. విగ్రహానికి, గుడికీ ప్రచారం చేసుకోగలశక్తి ప్రేమ్‌నాథ్‌కి ఉంది. కనకం విగ్రహం నుంచి అంతకుమించి పెద్ద ప్రయోజనాన్నాశించలేదు.

ఆమె దృష్టంతా వ్యాపారంమీదే వుంది.

కనకం ఆధ్వర్యంలో ప్రకాశరావు వ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. తన వ్యాపారంలో ఒకో మెట్టే పైకివెడుతుంటే అతడికి పురోహితుడిపై నమ్మకం పెరిగిపోతోంది.

ప్రకాశరావు తల్లికిప్పుడు జీవితం సుఖంగా వుంది. తనయుడు తప్పు చేస్తున్నాడన్న ఆలోచనే లేదామెకు.

కనకం మాత్రం భర్తకు చెప్పింది. నువ్వే తప్పు చేసినా నాకు తెలియాలి. నా ద్వారానే నీ తప్పు జరగుతుంది. నాకు

చెప్పని తప్పు నిన్ను పాపమై బాధిస్తుంది. శాపమై వేధిస్తుంది.''

ప్రకాశరావుకి పురోహితుడినిమించి భార్యలో గురివుంది.

కిళ్ళీకొట్టు స్థాయినుంచి డిపార్ట్‌మెంటల్ స్టోర్‌దాకా ఎదిగాడతడు.

ఒకప్పుడు తల్లినికాదని దైవానికి చెప్పుకునేవాడతడు తన తప్పులు.

ఇప్పుడు దైవాన్ని కాదని భార్యకు చెప్పుకుంటు న్నాడతడు తన తప్పులు.

కనకం పురోహితుడి ద్వారా ప్రాయశ్చితం చేయించి అతడి తప్పులు పరిచేస్తోంది.

అయితే దేవుడున్నాడా?

మనం తప్పులు చేయడం కొనసాగిస్తూనే ప్రాయశ్చితం కోరుకుంటే చాలని దేవుడు మనని క్షమిస్తాడా?

ప్రకాశరావుని మూర్ఖుడనుకునే వారందరూ తిరుపతి వెంకటేశ్వరుని ఆదాయం గురించి మరిచిపోరాదు.

నిప్పులేనిదే పొగరాదు.

దేవుడికి మహిమలువున్నాయని రుజువుండే వుంటుంది. అందుకే ప్రజలు తప్పులుచేస్తూ దేవుడి చుట్టూ తిరుగుతున్నారు.

అయినప్పటికీ ఉన్నవారినీ లేనివారినీ భగవంతుడు శిక్షిస్తూనే వున్నాడు. అదెలా జరుగుతోంది?

ఉదాహరణకు ప్రకాశరావు విషయమే తీసుకుందాం!

* * *

కిరణ్మయి కలవారి బిడ్డ. తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచారు. కట్టుకున్నవాడు అల్లారుముద్దుగా చూసుకుంటున్నాడామెను.

ఎంత డబ్బున్నా కిరణ్మయికి హృదయం వుంది.

లేనివారిని చూసి ఆమె చాలా జాలిపడుతుంది. అన్నార్తులను చూస్తే ఆమె మనసు పాడవుతుంది.

పేదరికాన్ని, ఆకలిని పోగొట్టడానికి తన జాలి, డబ్బు చాలవని ఆమెకు తెలుసు. అందుకే వీలైనంతవరకు వారికి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తుంది. ఎక్కువగా వారులేని చోట్లలో తిరుగుతుంది. ఎవరైనా కంటబడితే ఆమె తప్పక సాయపడుతుంది.

ఆమె బలహీనత తెలిసిన పేదవారు కొందరున్నారు. వారామెనేదోవిధంగా కలుసుకునేందుకు ప్రయత్నిస్తారు.

ఆ విధంగా ఆమెపై బాగా ఆధారపడిన వారిలో నాగరాజొకడు.

నాగరాజుకి అరవై ఏళ్ళు.

ఉద్యోగంలో రిటైరయ్యాడు. పెన్షన్ నాలుగొందలు వస్తుంది. ఆయనకు సొంతఇల్లు లేదు. ఇంటి అద్దె రెండొందలు. ఆయన, భార్య ఉంటున్నారు. భార్యకు జబ్బు. ముగ్గురు కొడుకులాయనకు. ఒక్కరూ ఆయన్ను చూడరు.

ఒక రోజున కిరణ్మయి కారు పాడయింది. దగ్గర్లో టాక్సీ కూడాలేదు. బస్టాపుంది. అప్పుడే సన్నగా వాన తుంపర ప్రారంభమయింది.

కిరణ్మయి బస్సెక్కాలనుకుంది. బస్‌స్టాప్‌కు వెళ్ళి షెడ్‌లో నిలబడింది.

అక్కడే వున్నాడు నాగరాజు.

బస్సెప్పటికీ రాకపోతే ఆమె అతణ్ణి పలకరించింది. అతడి కథవిని చలించిపోయింది. అతడి బాధ్యతని తాను తీసుకుంది.

కలిసినప్పుడల్లా ఆమె అతడికి కొంత డబ్బిస్తుంది.

నాగరాజామెను మోసగించడంలేదు. బ్రతుకు మీది తీపితో ఆమె సాయాన్నందుకుంటున్నాడు.

ఇలాంటి వాళ్ళు మోసగాళ్ళన్న అభిప్రాయం ఆమెలో చాలామంది కలిగిస్తుంటారు. ఆమె నమ్మదు. తన సాయం ఆపదు.

ఆ రోజు కిరణ్మయి ప్రకాశరావు డిపార్టుమెంటల్ స్టోరుకు వెళ్ళింది. అక్కడో పురాతన వస్తు విభాగముంది.

కిరణ్మయిలాంటివారు వచ్చినప్పుడు, ప్రకాశరావే స్వయంగా వారిని అనుసరించి ఆయా విభాగాలకు వెడతాడు. లేకుంటే ప్రతివిభాగానికి వేరే ఒక మేనేజరూ, సేల్స్‌మన్ ఉన్నారు.

ప్రకాశరావు కిరణ్మయితో వెళ్ళాడు.

అక్కడామెకొక కంచు విగ్రహంనచ్చింది.

''ఇది చాలా అపురూపమైనది. మూడవ శతాబ్దంలోనిది'' అన్నాడామెతో.

ఆమె ధర అడిగింది.

''మీ ఇష్టం. ఈ వస్తువు మీ బోటివారింట్లో ఉండడమే ఒక విశేషం. అదే మాకు తృప్తి?'' అన్నాడు ప్రకాశరావు.

ఆమె నొక్కించగా ''పనితనం విలువ కారణంగా ఇప్పటిదైనా ఈ విగ్రహం ఖరీదు ఎనిమిదివేలుంటుంది. అందులోనూ ఇది పురాతనమైనది...'' అన్నాడతడు.

కిరణ్మయి విగ్రహాన్ని పరీక్షించింది. దానిపై ఆమె మోజు పెరిగింది. పురాతనమైనదని ఆమె అతడికి హెచ్చు ధర ఇయ్యనంది.

ప్రకాశరావు ఎనిమిదివేలకు ఆమెకిచ్చాడది. అమ్మకంలో అతడి మాట నేర్పరితనం గురించి ఊళ్ళో చెప్పుకుంటారు.

కిరణ్మయి కంచువిగ్రహంతో ఇంటికెళ్ళింది. ఆ రోజే ఆమెను చూడ్డానికి వచ్చిన కిరణ్మయి చెల్లెలికా విగ్రహమెంతో నచ్చింది. తనకు కావాలందది.

కిరణ్మయి ప్రకాశరావుకి ఫోన్ చేసింది.

''మేడమ్! అది పురాతన వస్తువు. ఒక్క పీస్ మాత్రమే వుంది. అలాంటిది మరొకటి దొరకదు'' అన్నాడు ప్రకాశరావు.

కిరణ్మయి నిరుత్సాహ పడింది. చెల్లెలికి ఇచ్చేయాలనుకుంది.

''అక్కా! నాకలాంటి బొమ్మ కావాలి.పురాతనమైనదే అక్కర్లేదు. అందుకని వీలుపడితే అలాంటిది చేయించు...'' అంది కిరణ్మయి చెల్లెలు.

కిరణ్మయి వాకబుచేయగా ఊళ్ళో ఉండే రంగాచారి కంచు విగ్రహాలు చేయగలడని తెలిసింది. ఆమె అతడింటికి వెళ్ళింది.

రంగాచారి కిరణ్మయి దగ్గరఉన్న కంచు విగ్రహం చూసి ''ఇది నేను చేసిందే. ప్రకాశరావుగారికమ్మాని లాంటిదొకటి'' అన్నాడు.

అతడు దాని ధర పదిహేనువందలని చెప్పాడు.

సరిగ్గా నెలరోజుల్లో అతడు కిరణ్మయికి అచ్చం అలాంటి బొమ్మ చేసిచ్చాడు.

కనుగొన్నదానికీ అతడు చేసినదానికీ ఏమీ తేడాలేదని కిరణ్మయి గమనించింది.

ఆమె ఆగ్రహం పట్టలేక రెండువిగ్రహాలూ తీసుకొని ప్రకాశరావువద్దకు వెళ్ళింది.

ప్రకాశరావామె చెప్పిందంతా శాంతంగా విన్నాడు.

''మేడమ్! మా వ్యాపారం పాడుచేయాలని రంగాచారి అబద్ధం చెప్పాడు. మీవంటి వారిని మోసంచేసి మేము వ్యాపారంలో పైకిరాగలమా?'' అన్నాడతడు.

అతడెంత తీయగా, వినయంగా మాట్లాడేడంటే కిరణ్మయి అతణ్ణి విగ్రహం వెనక్కు తీసుకోమని నొక్కించలేకపోయింది.

అంతస్థులో, హోదాలో అతడామెకు ఏ విధంగానూ తీసిపోడు. అలాంటివాడు వినయంగా, మెత్తగా మాట్లాడుతూంటే ఆమె ఏమీ అనలేకపోయింది.

అయితే ఆమెకాగ్రహం ఆగడంలేదు.

షాపులోంచి బయటపడింది.

ఆమె ఇంటికి చేరుకునేసరికి నాగరాజామె గురించి ఎదురుచూస్తున్నాడు. అతడి భార్యకు అర్జంటుగా వైద్యంజరగాలి. కొంచెం సీరియస్‌గా ఉంది.

నాగరాజు మాటలు విని కిరణ్మయి మండిపడింది— ''ఈ ప్రపంచమంతా మోసం, దగా అంతా నా మంచి తనాన్నీ మెత్తతనాన్నీ ఆసరాచేసుకుని మోసంచేయాలనుకునే వారే! మీ మాటలు నేను నమ్మను. మళ్ళీనాకు మీ మొహం చూపించకండి. ఒక్కపైసా కూడా యివ్వను. వెళ్ళండి.''

ఆ రోజామె కేమయిందో తెలియదు. నాగరాజు దిగులుగా, దీనంగా అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

కిరణ్మయిని మోసం చేసినందుకు— ప్రకాశరావు భార్యకు చెప్పుకుని పురోహితుడి ద్వారా ప్రాయశ్చిత్తం చేయించుకున్నాడు.

నాగరాజును కిరణ్మయి తూలనాడి పంపేస్తే— ఆ పాపం కిరణ్మయిని కాదనీ ప్రకాశరావు చేసిన మోసంకారణంగా ఆమె మనసు పాడై అలా ప్రవర్తించిందనీ— అందువల్ల ఆ పాపం ప్రకాశరావుకే అంటిందనీ ప్రకాశరావుకి తెలియదు.

అందువల్ల అతడాతప్పుకు ప్రాయశ్చిత్తం చేయించుకోలేదు.

అందువల్ల ప్రకాశరావును బాధించి వేధించే పాపాలూ, శాపాలూ ఉండనే ఉన్నాయి.

*



## లెసన్

''ఇక్కడికి రా అని ఇంగ్లీషులో ఎలా అనాలి?'' టీచర్ అడిగింది నానీని.

''కం హియర్ అనాలి'' చెప్పాడు.

''గుడ్. అక్కడికెళ్ళి అనటానికి?''

''నేనే అటువెళ్ళి కంహియర్ అంటాను టీచర్'' చెప్పాడు నానీ.

—కె.కిరణ్‌కుమార్
(హైదరాబాద్)